బాబు ఏరు దాటాక తెప్ప తగలేసేరకం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- సూపర్‌సిక్స్‌పై కూటమి నేతలను ప్రజలు నిలదీయాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి



సమావేశానికి పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆత్మకూరు: చంద్రబాబు నాయుడు ఏరుదాటాక తెప్ప తగలేసే రకమని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆరోపించారు. గురువారం పట్టణంలోని గొల్లపేటలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శిల్పా చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చాక పథకాల అమలును గాలికొదిలేశారని దుయ్యబట్టారు. తనను నమ్మే పరిస్థితుల్లో ప్రజలు లేరని గ్రహించి పవన్‌కళ్యాణ్‌ను వెంట బెట్టుకుని రైతులకు ఇదిగో రూ.20 వేలు, తల్లికి వందనం రూ.15 వేలు, మూడు గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు అంటూ ప్రజలకు ఆశ చూపి ఇప్పుడు రాష్ట్ర పరిస్థితి బాగోలేదనడం అన్ని వర్గాలను మోసం చేయడమేనన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఐదేళ్లలో రూ.3.50 లక్షల కోట్లు అప్పు చేస్తే కూటమి ప్రభుత్వం యేడాదికే రూ.1.80 కోట్ల అప్పు చేసిందన్నారు. ఆ డబ్బంతా ఏ ఒక్క పథకానికి ఖర్చు చేయకుండా కూటమి నేతలు జేబులు నింపుకున్నారని ఆరోపించారు.

రైతులను ఆదుకోవడంలో విఫలం

వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు ఎలాంటి కష్టం రాకుండా సీజన్ల వారీగా రైతు భరోసా ఇచ్చి ఆదుకున్నామి శిల్పా చక్రపాణిరెడ్డి గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతన్నల సమస్యలను గాలికొదిలేసిందన్నారు. రైతు భరోసా పథకానికే అన్నదాత సుఖీభవ పేరు మార్చి పెట్టుబడి సాయం అందివ్వకుండా కాలయాపన చేస్తూ అన్నదాతలను అప్పులపాలు చేస్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటం రూ.15 వేలు అమ్మిన పొగాకు.. ఇప్పుడు రూ.2 వేల నుంచి రూ.4 వేలకు, వరి ధాన్యం రూ.2400 నుంచి రూ.1,300కు, మినుము రూ.11 వేల నుంచి రూ.6 వేలకు పడిపోయినా గిట్టుబాటు ధర కల్పించాలనే ఆలోచన కూటమి ప్రభుత్వానికి లేకపోవడం తగదన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం


తనను నమ్ముకున్న కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని చక్రపాణిరెడ్డి అన్నారు. ఏ అవసరం వచ్చినా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. కూటమి ప్రభుత్వ బెదిరింపులకు ఎవరూ భయపడవద్దన్నారు. సుపరిపాలన పేరుతో తొలి అడుగు వేస్తున్న టీడీపీ నాయకులకు ఇవే చివరి అడుగులన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కూటమి ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు.

ఆత్మకూరులో రూ.1,300 కోట్లను పంపిణీ చేశాం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మ ఒడి, విద్యాదీవెన, విద్యావసతి, ఆరోగ్యశ్రీ, సున్నావడ్డీ, ఆసరా తదితర పథకాలతో రూ.1,300 కోట్లను ఆత్మకూరు పట్టణవాసులకు పంపిణీ చేశామని శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ప్రతి కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలతోపాటు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అయినా ప్రస్తుత ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి అవేవీ కనపడటం లేదన్నారు. ఒక్క అభివృద్ధి పథకాన్ని సక్రమంగా అమలు చేయలేకపోయినా అబద్ధాలు, మోసాలతో కాలం గడపడం బుడ్డాను మించినవారు లేరన్నారు. అంతకుముందు పార్టీ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, షంషూర్, సుల్తాన్, అంజాద్‌ఆలీ, వెంకటస్వామిగౌడ్, మోమిన్, మున్నీర్‌బాషా తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్‌మీర్, నాయకులు నాగరాజు, రమేష్, చాంద్‌బాషా, ప్రభుదాస్, దర్గమ్మ, రమేష్, సురేష్, విజయ్, నాగరాజు, ధనుంజయ, పార్వతి, శివశంకర్‌నాయుడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామి

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైలదేవస్థానం గురువారం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన దత్తాత్రేయ స్వామికి దేవస్థానం ఈఓ ఎం.శ్రీనివాసరావు దంపతులు, అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ



నినాదాలు చేస్తున్న మ్మార్పీఎస్ నాయకులు

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలో ఎమ్మార్పీఎస్(మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి) జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి మండల ఇన్‌చార్జ్ ప్రేమరాజు, మాజీ సర్పంచు మాసుం, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ జిల్లా సభ్యుడు నాగరాజు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెద్దన్న పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ధన్వంతరీ, చండీహోమాలు



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: ఆషాడమాసం, అమావాస్య సందర్భంగా గురువారం మహానందిలోని యాగశాలలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధాన అర్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మ, వేదపండితులు నాగేశ్వరశర్మ ధన్వంతరీ, చండీహోమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు ప్రత్యక్షంగా, పరోక్షంగా హోమపూజల్లో పాల్గొన్నారు. అలాగే స్థానిక అలంకార మండపంలో మహానందీశుడి దంపతుల కల్యాణం కనులపండువగా సాగింది. గంగ, కామేశ్వరీదేవి మహానందీశ్వరస్వామి ఉత్సవమూర్తులను అలంకరించి కల్యాణ క్రతువులను నిర్వహించారు.

మహానందిలో 38.2 మిల్లీమీటర్ల వర్షపాతం

మహానంది: మండలంలో గురువారం జిల్లాలోనే అత్యధికంగా 38.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నంద్యాల అర్బన్ పరిధిలో 23.8, బండి ఆత్మకూరు మండలంలో 22.2 మి.మీ వర్షం కురిసింది. దీంతో మండల రైతులు వరినాట్ల పనుల్లో నిమగ్నమయ్యారు.

పీ-4 సర్వే పారదర్శకంగా చేపట్టాలి

వెలుగోడు: మండలంలో పీ-4 సర్వేను పారదర్శకంగా చేపట్టాలని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం వేల్పనూరు, గుంతకందాల గ్రామాల్లో పీ4 అసైన్‌మెంట్ సర్వేను ఎంపీడీఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి-4 విధానం ద్వారా పేదలకు ఆర్థిక సాధికారత చేకూర్చడానికి జీవన ప్రమాణాలలో అట్టడుగు స్థాయిలోని 20 శాతం మంది నిరుపేదలను గుర్తించాల్సి ఉందన్నారు. దారిద్ర్యరేఖకు దిగువనున్న వారిని గుర్తించి, ప్రభుత్వం సూచించిన ప్రమాణాల మేరకు సర్వే చేపట్టి వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

సన్మానం



ఏఎన్‌ఎంలను సన్మానించిన వైద్యాధికారులు

మహానంది: గాజులపల్లె పీహెచ్‌సీలో పనిచేస్తూ బదిలీ అయిన ఆరుగురు ఏఎన్‌ఎంలను వైద్యులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గురువారం సన్మానించారు. ఈ సందరర్భంగా గాజులపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటరెడ్డి, డాక్టర్ జగదీష్ చంద్రారెడ్డి మాట్లాడుతూ ఎక్కడికెళ్లినా ప్రజలకు మంచి సేవలు అందించాలని సూచించారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

కొత్తపల్లి: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని మండల వ్యవసాయాధికారి అమిరున్నీసా బేగం రైతులకు సూచించారు. గురువారం నందికుంట గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచ్చలవిడిగా రసాయ ఎరువులు వాడితే భూసారం తగ్గడంతోపాటు దిగుబడులపై ప్రభావం చూపుతుందన్నారు. సేంద్రియ ఎరువులు వాడి అధిక దిగుబడులు సాధించుకోవాలని సూచించారు.

రైతులకు యూరియా అందించాలి



పగిద్యాల సహకార సొసైటీ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, సీపీఎం నాయకులు

నందికొట్కూరు: రైతులకు సకాలంలో యూరియా అందించాలని సీపీఎం పగిడ్యాల మండల నాయకులు ఫక్కీర్‌సాహెబ్ కోరారు. గురువారం పగిడ్యాల సహకార సొసైటీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా యూరియా రైతులకు అందించడంలో విఫలమైందన్నారు. టీడీపీకి అనుకూలంగా ఉన్న రైతులకు మాత్రమే ఎరువులు అందుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో రైతులు జగదీష్‌రెడ్డి, శేషన్న, బాలస్వామి, నాగన్న, లింగస్వామి, వెంకటరాముడు, నరసింహులు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి రూ.2 లక్షల చెక్ అందజేత



వెంకటలక్ష్మికి చెక్ అందజేస్తున్న మేనేజర్ శ్రీకాంత్

నందికొట్కూరు: మండల పరిధిలోని బ్రాహ్మణ కొట్కూరు ఇండియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీకాంత్ మిడుతూరు మండలం నాగలూటి గ్రామానికి చెందిన వెంకటలక్ష్మికి చెక్ అందజేశారు. ఆమె భర్త మల్లయ్య ఇండియన బ్యాంక్‌లో ఖాతాదారుడు. అలాగే ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన(పీఎంజేజేబీవై) కింద రూ.436 ఇన్సూరెన్స్ చెల్లించాడు. ఇటీవల అతడు గుండెపోటుతో మృతి చెందడంతో నామినిగా ఉన్న భార్య వెంకటలక్ష్మికి బ్యాంక్ రూ.2 లక్షల ఆర్థిక సాయం అందజేసినట్లు మేనేజర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం కౌన్సిలర్స్ నాగార్జున, రియాజుద్దీన్, ఎస్ఎస్ సంస్థ పీడీ ఆంజనేయులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు తొలగించాలి

కొత్తపల్లి: రోడ్లకు ఇరువైపులా అక్రమ కట్టడాలను తొలగించి డ్రైనేజీలు ఏర్పాటుచేయాలని వీరాపురం ఎస్సీ కాలనీవాసులు జి.మల్లయ్య, రాధాకృష్ణ, వెంకటరమణ, లింగన్న, నాగశేషన్న గురువారం ఎంపీడీఓ మేరిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు దిగువన, ఇళ్లు ఎత్తులో ఉండడంతోపాటు కొందరు అక్రమ నిర్మాణాలు చేసుకోవడంతో మురుగు నీరు రోడ్లపై నిలిచిపోతుందని వివరించారు. డ్రైనేజీలు ఏర్పాటు చేయకుండా సీసీరోడ్లపై బిలుకు, మొరుసు వేయడంతో బురదమంగా తయారైందని, సమస్య పరిష్కారానికి డ్రైనేజీ ఏర్పాటు ఒక్కటే మార్గమని కోరారు. స్పందించిన ఎంపీడీఓ.. అధికారలతో చర్చించి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

మరబోట్లు తిప్పితే సీజ్ చేస్తాం

కొత్తపల్లి: సంగమేశ్వరం వద్ద కృష్ణా నదిలో మరబోట్లు ఆంధ్ర వైపు నుంచి తెలంగాణ సోమశిలకు తిప్పితే బోట్లు సీజ్ చేయడంతోపాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ ఉమారాణి హెచ్చరించారు. గురువారం ఆమె మాట్లాడుతూ సంగమేశ్వరం, సిద్ధేశ్వరం, జానాల గూడెం, బలపాలతిప్ప గ్రామాల నుంచి తెలంగాణ ప్రాంతం సోమశిలకు మరబోట్లలో ప్రయాణికులను చేరవేయడం చట్టరీత్యా నేరమన్నారు. శ్రీశైలం జలాశయం నిండుగా ఉన్నందునా, ఎగువ నుంచి వరద నీరు ఎక్కువగా వస్తున్నందున ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, నిబంధనలు అతిక్రమించి పుట్టీలలో కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లరాదని సూచించారు.

కచ్చితత్వంతో సర్వే రికార్డులు రూపొందించాలి

నంద్యాల(అర్బన్): గ్రామ సర్వేయర్లు, ఆధునిక సర్వే సాంకేతిక పరికరాలతో సంబంధిత స్టాఫ్‌వేర్‌ను ఉపయోగించి కచ్చితత్వంతో కూడిన సర్వే రికార్డులను తయారు చేయాలని సర్వే, భూమి రికార్డుల శాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక పీజీఆర్ఎస్‌లో సర్వే యంత్రాంగంతో భూ సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2027లోపు భూముల రీ సర్వే పూర్తి చేయాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. భూ సమస్యల పరిష్కారానికి రీ సర్వే భూయజమానులకు ఒక మంచి పరిష్కార వేదిక అని అన్నారు. భూయజమానుల సహాయ సహకారాలతో సర్వే బృందం నాణ్యతతో సర్వే చేయాలని చెప్పారు. సర్వే సమయంలో ఏదైనా సమస్య వచ్చినా, రైతులకు అర్థమయ్యేటట్లు వివరించాలన్నారు. నిర్దేశించిన సమయంలోపు రైతుల దరఖాస్తులను పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖ అధికారి జయరాజు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా గురువారం ఆలయ దక్షిణ మాడ వీధుల్లోని నిత్య కళావేదికపై సికింద్రాబాద్‌కి చెందిన ఆర్.కె.ఎస్. కళానిలయం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. వినాయకకౌత్వం, నటేశకౌత్వం, భో.. శంభో, మహాదేవశివ, లింగాష్టకం, అయిగిరినందిని తదితర గీతాలకు సహస్ర, లౌక్య, జ్యోతిర్మయి అక్షరఅలేఖ్య, మైత్రి, స్వాతి, కిరణ్మయి తదితరులు నృత్యప్రదర్శన చేశారు.

ప్రజల తరపున నిలబడదాం

- మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



శిల్పాతో మోమిన్ మున్నీర్‌బాషా, తదితరులు



మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసిన వెలుగోడు మండల నాయకులు

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల నేతలంతా ప్రజల తరపున నిలబడి పోరాటం చేయాలని మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సూచించారు. మండలానికి చెందిన నసిరుల్లాఖాన్ వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈసందర్భంగా ఆయన గురువారం ఆత్మకూరులోని పార్టీ కార్యాలయంలో చక్రపాణి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా పదవులు దక్కించుకున్నవారు పార్టీ అభివృద్ధి కోసం పని చేయాలని శిల్పా సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మెంబర్ ఇలియాస్ ఖాన్, ఎంపీపీ లాలం రమేష్, వెలుగోడు సర్పంచ్ వేల్పుల జయపాల్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ఏసురత్నం తదితరులు ఉన్నారు.

- **ఆత్మకూరు:** వైఎస్సార్‌సీపీ మైనార్టీ సెల్ స్టేట్ సెక్రటరీగా ఎన్నికైన మోమిన్ మున్నీర్‌బాషా గురువారం మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా శిల్పా మాట్లాడుతూ మైనార్టీల సమస్యలను ఎప్పటికప్పుడు అధినేత వైఎస్ జగన్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు సయ్యద్ మీర్, మైనార్టీ సెల్ స్టేట్ జనరల్ సెక్రటరీ అంజాద్‌ఆలీ, కౌన్సిలర్ సుల్తాన్ పాల్గొన్నారు.

నేడు రేగడగూడూరులో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

వెలుగోడు: రేగడగూడూరు గ్రామంలో శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల, పట్టణ అధ్యక్షులు అంబాల ప్రభాకర్ రెడ్డి, ఇలియాస్ ఖాన్ తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలకు బీసీ కాలనీ, వడ్డే వీధిలో మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

- శుక్రవారం ఉదయం వెలుగోడులో నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వారు తెలిపారు.

అందుబాటులో ఎరువులు

పాములపాడు: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు రైతులకు అందుబాటులో ఉంచామని మండల వ్యవసాయాధికారి మహేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తుమ్మలూరు గ్రామ పంచాయతీ మినహా అన్న గ్రామ పంచాయతీల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. 607.68 మెట్రిక్ టన్నుల యూరియా, 78 మెట్రిక్ టన్నుల డీఏపీ, 10 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సిద్ధంగా ఉందన్నారు. అవసరం మేరకే యూరియాను తీసుకెళ్లాలని రైతులకు సూచించారు.

స్మార్ట్ మీటర్లను అడ్డుకోండి

వెలుగోడు: విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించడానికి ఎవరైనా వస్తే ప్రజలంతా ఐక్యంగా అడ్డుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఏసురత్నం సూచించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్లో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ప్రమాదాన్ని వివరించారు. సీపీఎం మండల నాయకులు మహమ్మద్ రఫీ, నాగమోహన్, ఎర్రబాషా తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బండి ఆత్మకూరు: మండలంలోని నాయిని చెరువు గ్రామ అంగన్‌వాడీ సెంటర్ ఆయా పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత ఉన్న ఎస్‌టీ మహిళలు ఈనెల 31లోపు దరఖాస్తులను ఆత్మకూరు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త

బండి ఆత్మకూరు: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని ఎస్ఐ జగన్‌మోహన్ సూచించారు. గురువారం సోమయాజులపల్లి గ్రామంలో ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చే మొబైల్ నంబర్లకు బదులు ఇవ్వొద్దని, మొబైల్‌లో ఎలాంటి బెట్టింగ్ యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవద్దని, వాటిని సోషల్ మీడియా ద్వారా ఇతరులకు షేర్ చేయవద్దని సూచించారు. వ్యక్తిగత, బ్యాంకు ఖాతాల వివరాలు, ఓటీపీ ఎవరికీ చెప్పరాదన్నారు. అనుమానిత యాప్‌లపై టోల్ ఫ్రీ నెంబర్ 1930కు కాల్ చేయాలన్నారు.

రహదారుల అభివృద్ధి పట్టదా



గుంతలమయంగా మారిన పగిద్యాల రోడ్డును చూపుతున్న ప్రయాణికులు, నాయకులు

నందికొట్కూరు: రహదారుల అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు వెంకటేశ్వర్లు, స్వామన్న, ప్రయాణికులు ఎర్రన్న, కురవ వెంకటేశ్వర్లు, సురేష్, సుధాకర్, రామనాయుడు, స్వాములు నాయుడు ఆరోపించారు. గుంతల పడిన పగిడ్యాల రోడ్లను వారు గురువారం పరిశీలించారు. పగిద్యాల – నందికొట్కూరుకు వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తుందని, అయినా ఇక్కడి ప్రజాప్రతినిధులు పట్టించుకోకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు జరుగుతున్నా కన్నెత్తి చూసే నాథుడే లేరన్నారు. ఇప్పటికైనా ఎంపీ, ఎమ్మెల్యేలు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని వారు డిమాండ్ చేశారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి దేవి జయంత్యుత్సవాలు



బండిఆత్మకూరులో అమ్మవారి గ్రామత్సవంలో పాల్గొన్న భక్తులు



పాములపాడులో అమ్మవారి పూజల్లో పాల్గొన్న మహిళలు



వెలుగోడులో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



ఆత్మకూరులో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: చౌడేశ్వరీ దేవి జయంత్యుత్సవాలు శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవారి ఆలయాలకు చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వెలుగోడు రెడ్డిగారి వీధిలో వెలసిన చౌడేశ్వరి దేవి ఆలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పురోహితుడు సానా నాగేంద్రుడు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించుకున్నారు. పాములపాడు, కొత్తపల్లి మండల కేంద్రాల్లో చౌడేశ్వరీ మాతకు మహిళలు కుంకుమ పూజ నిర్వహించి, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. బండిఆత్మకూరులోని చౌడేశ్వరి దేవి గ్రామోత్సవంలో భక్తులు భారీగా పాల్గొన్నారు.

- ఆత్మకూరులో చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించి తొట్ల ఉత్సవం నిర్వహించారు.

వీబీఆర్‌కు జలకళ

- నిండుకుండలా వెలుగోడు జలాశయం
- పెరిగిన సందర్శకుల తాకిడి




కృష్ణా జలాలతో కళకళలాడుతున్న వెలుగోడు రిజర్వాయర్



వన్ ఆర్ కాల్వ వద్ద పర్యాటకుల సందడి



బానకచర్ల నుంచి వీబీఆర్‌లోకి వస్తున్న నీరు



మద్రాస్ కాల్వకు వెళ్తున్న నీరు

వెలుగోడు: కృష్ణమ్మ పరవళ్లతో తెలుగుగంగ పథకంలో భాగమైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నీటితో తొణికిసలాడుతోంది. కొద్ది రోజులుగా వెలుగోడు జలాశయానికి నిరంతరంగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లోను పరిగణనలోకి తీసుకొని ఎప్పటికప్పుడు ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల చేస్తున్నారు. ఇటీవల ఎగువ రాష్ట్రాల నుంచి శ్రీశైలానికి భారీగా వరద వచ్చి చేరడంతో 10 రోజుల నుంచి వీబీఆర్‌కు నీటి విడుదలను ప్రారంభించారు. అప్పటి నుంచి నేటి వరకు నిరంతరం వీబీఆర్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం బానకచర్ల క్రాస్‌రెగ్యులేటర్ నుంచి 7,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది.

కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైల్ల జలాశయం వెనకతట్టు జలాలను తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు చేర్చడంతో జలాశయం గరిష్ట నీటి సామర్థ్యం 16.95 టీఎంసీలకు గానూ గురువారం సాయంత్రానికి 263.86 మీటర్ల వద్ద 865.681 అడుగులతో 15.507 టీఎంసీల నీటి నిల్వలు నమోదయ్యాయి. ఇటీవల వీబీఆర్ నుంచి మద్రాస్ కాల్వకు నీటి విడుదల ప్రారంభించారు. మద్రాస్ ప్రధాన కాల్వకు 8,670 క్యూసెక్కులు, వన్ ఆర్ కాల్వకు 60 క్యూసెక్కులు, వన్ ఎల్ కాల్వకు 30 క్యూసెక్కుల నీటిని అవుట్‌ఫ్లోగా విడుదల చేస్తున్నారు. జలాశయంలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండటంతో ఆయకట్టు రైతులు వరి సాగుకు సిద్ధమవుతున్నారు. అలాగే వెలుగోడు, ఆత్మకూరు, నంద్యాల ప్రాంతాల ప్రజలకు కూడా తాగునీటి ఎద్దడి తీరనుంది.

సందర్శకుల తాకిడి..

వరద నీటితో తొణికిసలాడుతున్న వెలుగోడు జలాశయాన్ని వీక్షించేందుకు సందర్శకుల తాకిడి పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వస్తున్న సందర్శకులతో వెలుగోడు రిజర్వాయర్ వద్ద సందడి నెలకొంది. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన ప్రాజెక్ట్ కావడంతో శ్రీశైలం – మహానంది క్షేత్రాలకు వెళ్లే పర్యాటకులు మార్గమధ్యంలో ఉన్న వీబీఆర్ జలాశయాన్ని సందర్శిస్తున్నారు. వాహనాలను నేరుగా మట్టికట్టపైకి తీసుకెళ్లి అక్కడ ఆహ్లాదాన్ని పొందుతున్నారు.